క్లుప్తంగా

పొలాల్లో మయూరం



మొగిలి వద్ద పొలంలో సంచరిస్తున్న నెమలి

బంగారుపాళెం: మండలంలోని మొగిలిలో సమీపంలో పొలాలలో ఆదివారం ఓ నెమలి కనువిందు చేసింది. కొన్ని రోజులు క్రితం సమీపంలోని కౌండిన్య అటవీ ప్రాంతం నుంచి నెమలి పొలాల వైపు వచ్చింది. అప్పటి నుంచి ఆ ప్రాంతాల్లోనే సంచరిస్తోందని గ్రామస్తులు, రైతులు చెప్పారు. పగటి పూట పొలాల్లో తిరుగుతూ రాత్రి సమయంలో చెట్లపై ఉంటున్నట్టు తెలియజేశారు.

నీటి సంఘ కార్యవర్గానికి సన్మానం

చిత్తూరు రూరల్ (కాణిపాకం): చిత్తూరు మండలం దిగువమాసాపల్లె చెరువు నీటి సంఘ నూతన కార్యవర్గ సభ్యులను ఆదివారం రైతులు సన్మానించారు. అధ్యక్షులు కిల్లారి శ్రీరాములునాయుడు, సభ్యులు మాధవ, హరిప్రసాద్, నందినాయుడు, వెంకటేశ్‌నాయుడు, అశోక్‌లను గజమాలలతో సత్కరించారు. కార్యక్రమంలో రైతులు పాల్గొన్నారు.

ఓం శక్తి భక్తుల అన్నదానం



ఓం శక్తికి పూజలు చేస్తున్న భక్తులు

బంగారుపాళెం: స్థానిక దళితవాడలో ఆదివారం ఓం శక్తి భక్తులు అన్నదాన కార్యక్రమాన్ని నిర్వహించారు. గ్రామానికి చెందిన 150 మంది భక్తులు గురుస్వామి ఆనందయ్య ఆధ్వర్యంలో ఓం శక్తి అమ్మవారి మాలధారణ దీక్ష స్వీకరించారు. ఈ సందర్భంగా ఉదయం అమ్మవారికి ప్రత్యేక పూజా కార్యక్రమాలను నిర్వహించారు. మధ్యాహ్నం అన్నదానం చేశారు.

సామాజిక సేవకుడికి సన్మానం

పలమనేరు: పట్టణానికి చెందిన సామాజిక సేవకులు శ్రీపురం సీతారామయ్య 88వ జన్మదినాన్ని పురస్కరించుకుని స్థానిక లయన్స్‌క్లబ్ తోపాటు పలు సంస్థలు ఆదివారం ఆయన చేస్తున్న సేవలను కొనియాడుతూ పౌర సన్మానం చేశాయి. విద్యాసంస్థలు, అంగన్‌వాడీలు, ఉచిత కంటి పరీక్షలు, సామూహిక వివాహాలు, సాహితి, సాంస్కృతిక కార్యక్రమాలు, మధ్యాహ్న భోజనానికి ప్లేట్లను ఆయన గత పదేళ్లుగా అందిస్తున్న విషయం తెలిసిందే.

ఈరోజు

ప్రజా సమస్యల పరిష్కార వేదిక

ఐరాల: సోమవారం తన కార్యాలయంలో ప్రజా సమస్యల పరిష్కార వేదిక కార్యక్రమం నిర్వహించనున్నట్లు ఉదయం 10 నుంచి మధ్యాహ్నం ఒంటి గంట వరకు నిర్వహించనున్నట్లు తహసీల్దార్ మహేష్‌కుమార్ తెలిపారు.. ప్రజలు సమస్యలను అర్జీల రూపంలో తెలియజేయాలని కోరారు.

కోనగుంటలో ఫ్యామిలీ డాక్టర్

ఐరాల: మండలంలోని కోనగుంటలో సోమవారం ఫ్యామిలీ డాక్టర్ కార్యక్రమం ఉదయం 10 నుంచి సాయంత్రం 4 గంటల వరకు నిర్వహించనున్నట్టు స్థానిక పీహెచ్‌సీ వైద్యాధికారి ప్రవీణ్‌కుమార్ తెలిపారు. ఈ కార్యక్రమాన్ని గ్రామస్తులు సద్వినియోగం చేసుకోవాలని ఆయన కోరారు.

నూతనోత్తేజం





మాట్లాడుతున్న నియోజకవర్గ ఇన్‌చార్జి, పూతలపట్టు మాజీ ఎమ్మెల్యే డాక్టర్ సునీల్‌కుమార్, పార్టీ జిల్లా అధ్యక్షులు కరుణాకరరెడ్డి, డాక్టర్ సునీల్‌కుమార్‌ను సన్మానించి స్వాగతం పలుకుతున్న పార్టీ కార్యకర్తలు

- కష్టపడి పని చేసే ప్రతి కార్యకర్తకూ ప్రాధాన్యం
- పూతలపట్టు నియోజకవర్గ వైఎస్సార్‌సీపీ ఇన్‌చార్జ్ సునీల్‌కుమార్

తవణంపల్లె: తిరుపతి, చిత్తూరు ఉమ్మడి జిల్లాల వైఎస్సార్‌సీపీ అధ్యక్షులు భూమన కరుణాకరరెడ్డి నేతృత్వంలో పార్టీ నాయకులు, కార్యకర్తలను ఏకతాటిపైకి తీసుకొచ్చి పార్టీకి పూర్వవైభవం తెస్తామని పూతలపట్టు నియోజకవర్గ సమన్వయకర్త, మాజీ ఎమ్మెల్యే డాక్టర్ సునీల్‌కుమార్ స్పష్టం చేశారు. ఆదివారం మండలంలోని సిద్ధంపల్లె సమీపంలోని కాణిపాకం రోడ్డులో ఒక కల్యాణమండపంలో వైఎస్సార్‌సీపీ పూతలపట్టు నియోజకవర్గ స్థాయి సర్వసభ్య సమావేశం నిర్వహించారు. అధ్యక్షత వహించి సునీల్‌కుమార్



సునీల్‌కుమార్‌ను శాలువతో సత్కరిస్తున్న జిల్లా పార్టీ మహిళా విభాగం కార్యదర్శి గౌహతిరెడ్డి

మాట్లాడారు. కూటమి నాయకుల నుంచి దౌర్జన్యాలు, దాడులు ఎదుర్కొంటున్నా కార్యకర్తలు చెక్కుచెదరని ఆత్మవిశ్వాసం, ధైర్యంతో ఉండటం ఆనందంగా ఉందన్నారు. కష్టకాలంలో పార్టీ కోసం పని చేసే కార్యకర్తకు అండగా ఉంటామన్నారు. కూటమి ప్రభుత్వ వైఫల్యాలే వచ్చే ఎన్నికల్లో మనం గెలవడానికి శ్రీరామ రక్ష అన్నారు. అబద్ధాలు చెప్పే చంద్రబాబు హామీలను నెరవేర్చకుండా ఏమార్చుతున్నారని విమర్శించారు. కార్యకర్తలు కలసి కట్టుగా ఐకమత్యంలో కూటమి నాయకులు ఆగడాలను ప్రతిఘటించాలన్నారు. పెద్దిరెడ్డి, భూమన నాయకత్వంలో పార్టీని ముందుకు తీసుకెళ్లాలని కోరారు. చంద్రబాబుకు వెన్నుదన్నుగా ఉంటున్న ఎల్లో మీడియా, సోషల్ మీడియా వాస్తవాలను గమనించి పోస్టులు పెట్టాలన్నారు.

పార్టీ కార్యకర్తల్లో ఆత్మస్థైర్యం నింపిన కరుణాకరరెడ్డి

జిల్లా పార్టీ అధ్యక్షులు భూమన కరుణాకరరెడ్డి ప్రసంగం కార్యకర్తల్లో ఆత్మస్థైర్యాన్ని నింపింది. 'అన్నా.. మీ నాయకత్వంలో పార్టీకి పూర్వవైభవం వస్తుందనే నమ్మకం మాకు ఉంది' అని కార్యకర్తలు నినదించారు.

పని చేసే కార్యకర్తలకు ప్రాధాన్యత ఇవ్వాలి

వైఎస్సార్‌సీపీకి కష్టపడి పని చేసే కార్యకర్తలకు ప్రాధాన్యత ఇవ్వాలని పలువురు కార్యకర్తలు జిల్లా పార్టీ అధ్యక్షులు, నియోజకవర్గ సమన్వయకర్త దృష్టికి తీసుకొచ్చారు. దీనిపై భూమన స్పందించారు. జగన్ మోహన్ రెడ్డి ఆకాంక్ష మేరకు కార్యకర్తల్లో ఆత్మస్థైర్యం నింపి వారికి అండగా నిలుస్తామన్నారు. నిస్వార్థంలో పార్టీలోని ప్రతి కార్యకర్తకు న్యాయం చేస్తానన్నారు.

కార్యకర్తల్లో జోష్

పార్టీ నియోజజకవర్గ స్థాయి సర్వసభ్య సమావేశం కార్యకర్తల్లో జోష్ నింపింది. నాయకులు ప్రసంగిస్తున్నప్పుడు.. జై జగనన్న.. జై వైఎస్సార్‌సీపీ అంటూ నివాదాలతో హోరెత్తించారు. ఇదే ఉత్సాహంతో పార్టీకి పట్టుకొమ్మలైన కార్యకర్తలు పార్టీని ముందుకు నడిపించాలని మార్గదర్శనం చేశారు. నియోజకవర్గంలోని పార్టీ నాయకులు, కార్యకర్తలు, యూత్ పాల్గొన్నారు.

25న హనుమాన్ చాలీసా పారాయణం

కాణిపాకం: ఈనెల 25న కాణిపాకంలోని శ్రీవరసిద్ధి వినాయకస్వామి దేవస్థానంలో హనుమాన్ చాలీసా పారాయణం చేయనున్నట్లు ఈఓ పెంచల కిషోర్ ఒక ప్రకటనలో తెలిపారు. ఆస్థాన మండపంలో ఉదయం 10 నుంచి మధ్యాహ్నం 3 గంటలకు ఈ కార్యక్రమం నిర్వహిస్తామని, భక్తులు విరివిగా పాల్గొని జయప్రదం చేయాలని కోరారు.

త్రైత సిద్ధాంత భగవద్గీతపై ప్రచారం



భగవద్గీతపై ప్రచారం చేస్తున్న సభ్యులు

బంగారుపాళెం: మండలంలోని వెలుతురుచేనులో ఆదివారం ప్రబోధ సేవాసమితి ఇందూ జ్ఞాన వేదిక బంగారుపాళెం కమిటీ-1,2 సభ్యులు త్రైత సిద్ధాంత భగవద్గీత గ్రంథాలపై ప్రచారం చేశారు. కమిటీ అధ్యక్షులు బాలాజి, ధనుంజయ మాట్లాడారు. మార్గశిర మాసంలో భక్తి ప్రపత్తులతో ఉండాలన్నారు. దైవభక్తి, గ్రంథ పఠనంతో ఆధ్యాత్మిక చింతన పెంపొందించుకోవాలని కోరారు. సర్వ మతాలకు దేవుడు ఒక్కడేనని, ప్రజల్లో దైవ భక్తిని పెంపొందించడానికి త్రైత సిద్ధాంత భగవద్గీత గ్రంథాలను గురించి గ్రామాల్లో ప్రచారం చేస్తున్నట్లు తెలిపారు. సమాజంలో కులమతాలను రూపు మాపి, ప్రజల మధ్య నెలకున్న అసమానతలను తొలగించడానికి భగవద్గీత పఠనం చేయాలన్నారు. కార్యక్రమంలో కమిటీ సభ్యులు పాల్గొన్నారు.

విధులు ఒకచోట.. నివాసం మరో చోట!

- సమయపాలన తప్పుతున్న అధికారులు
- ప్రజలకు తప్పని పడిగాపులు

గుడిపాల: పనిచేస్తున్న చోట అధికారులు నివాసం ఉండాలని ఎన్నడో ప్రభుత్వం జారీ చేసిన జీఓ ఉంది. అయితే ఈ జీవోను ఎవరూ పాటించడం లేదు. కొంతమంది అధికారులు సమయపాలన పాటించకుండా ఇష్టారాజ్యంగా విధులకు హాజరవుతున్నారు. దీంతో ప్రజలకు అందుబాటులో ఉండడం లేదనే విమర్శలొస్తున్నాయి. ముఖ్యంగా రెవెన్యూ, మండల పరిషత్, వైద్య, ఆరోగ్య, పంచాయతీ రాజ్, వ్యవసాయశాఖ, ఐసీడీఎస్, సచివాలయ, విద్యాశాఖ కార్యాలయాల్లో పనిచేసే అధికారులు, సిబ్బంది చిత్తూరులో నివాసం ఉంటూ గుడిపాలలో విధులకు హాజరవుతున్నారు. వీరంతా రోజూ ఉదయం 10గంటలకే ఆయా కార్యాలయాలకు రావాలి.అయితే అధికారులు ఉదయం 11గంటలైనా కార్యాలయాలకు రావడం లేదు. దీంతో సమస్యలపై వచ్చిన ప్రజలు అధికారులు వచ్చేంత వరకు పడిగాపులు కాయాల్సి వస్తోంది. ఇప్పటికైనా ఉన్నతాధికారులు స్పందించి మండలంలోని అధికారులు సమయపాలన పాటించేలా చర్యలు తీసుకోవాలని మండల ప్రజలు కోరుతున్నారు.

పగలే వెన్నెల!



పట్ట పగలైనా వెలుగుతున్న వీధిలైటు

గుడిపాల: ఓపక్క విద్యుత్ కోతలు ఉంటే, మరో వైపు మాత్రం పట్టపగలు కూడా వీధిలైట్లు వెలుగుతున్నాయి. మండలంలోని చలిచీమలపల్లె దళితవాడలోని వీధుల్లో వీధిలైట్లకు ఆన్ ఆఫ్ స్విచ్‌లు లేకపోవడంతో కరెంట్ ఉన్నంత సేపు లైట్లు వెలుగుతూనే ఉన్నాయి. ఇప్పటికైనా అధికారులు స్పందించి కరెంటు దుబారాను అరికట్టాలని కోరుతున్నారు.

అర్ధగిరిలో ఘనంగా కార్తీక పౌర్ణమి

తవణంపల్లె: ప్రముఖ పుణ్యక్షేత్రమైన అర్ధగిరి శ్రీ వీరాంజనేయస్వామి దేవస్థానంలో ఆదివారం కార్తీక పౌర్ణమి వేడుకలను భక్తిశ్రద్ధలతో ఘనంగా నిర్వహించారు. ఉదయం అర్చకులు స్వామికి అభిషేకం చేయించారు. అనంతరం స్వామికి గంధం, సుగంధ పుష్పాలు, తమలపాకులతో ప్రత్యేక అలంకరణ చేశారు. తర్వాత అర్చకులు స్వామికి పూజలు నిర్వహించి ధూప దీప నైవేద్యాలు సమర్పించారు. పలు రాష్ట్రాల భక్తులు స్వామిని దర్శించుకుని మొక్కులు చెల్లించారు.

భక్తిశ్రద్ధలతో సుదర్శన హోమం

ఆలయ మండపంలో అర్చకులు స్వామి వారికి శాస్త్రోక్తంగా ఉభయదారులతో సుదర్శన హోమం నిర్వహించారు. పూర్ణాహూతి అనంతరం భక్తులకు తీర్థ ప్రసాదాలు పంపిణీ చేశారు. పౌర్ణమి వేడుకలను విచ్చేసిన భక్తులకు ఉదయం నుంచి రాత్రి వరకు ఉచిత ప్రసాదాలు అందజేశారు. అర్చకులు



అర్ధగిరి క్షేత్రంలో నిర్వహిస్తున్న ప్రాకారోత్సవం

రాత్రి ఉత్సవమూర్తికి అభిషేకం, పూజలు చేయించారు. పల్లకిలో కొలువుదీరిన స్వామి వారికి ప్రాకారోత్సవం వైభవంగా నిర్వహించారు. భక్తుల కాలక్షేపం కోసం పలు సాంస్కృతిక కార్యక్రమాలు నిర్వహించారు. ఆలయ ఈఓ హనుమంతురావు, సిబ్బంది, ఉభయదారులు పాల్గొన్నారు.

తెలుగు జాతిపిత పొట్టి శ్రీరాములు



పురస్కారాలు అందుకున్న వారితో నిర్వాహకులు

- 20 మందికి 'అమరజీవి' పురస్కారాలు ప్రదానం

చిత్తూరు రూరల్ (కాణిపాకం): ఆంధ్రరాష్ట్రం కోసం 58 రోజులపాటు ఆమరణ నిరాహారదీక్ష చేసి ప్రాణాలర్పించి అమరజీవిగా పొట్టి శ్రీరాములు ప్రజల గుండెల్లో చిరస్మరణీయులయ్యారని భారతీయ తెలుగు రచయితల సమాఖ్య జాతీయ గౌరవాధ్యక్షులు మర్రిపూడి దేవేంద్రరావు అన్నారు. అమరజీవి వర్ధంతి పురస్కరించుకుని ఆదివారం చిత్తూరులోని సమాఖ్య కార్యాలయంలో ‹తెలుగు జాతిపిత పొట్టి శ్రీరాములు ఆంధ్రరాష్ట్ర దీక్ష› అనే అంశంపై సదస్సు నిర్వహించారు. దేవేంద్రరావు మాట్లాడుతూ శ్రీరాములు లాంటి వ్యక్తులు పది మంది ఉంటేచాలు స్వాతంత్ర్యం పది రోజులలో వచ్చేదని గాంధీజీ అన్నారని ఆయన మాటలను ఉటంకించారు. రచయిత గొడుగుచింత గోవిందయ్య మాట్లాడుతూ, ప్రఖ్యాత గాంధేయవాదిగా, స్వాతంత్ర్య సమర యోధుడిగా పొట్టిశ్రీరాములు సాంఘిక దురాచారాలను రూపుమాపడం కోసం నిరసన దీక్షలు చేసిన త్యాగమూర్తి అని ప్రస్తుతించారు. రచయితలు తోట గోవిందన్, పాలకూరు కన్నయ్య, ఎస్. మునీంద్ర, సంఘ సేవకులు బి. కోటీశ్వర మొదలియార్ తదితరులు మాట్లాడారు. అట్టడుగు వర్గాల సముద్ధరణకు అహింసామార్గంలో అసువులు బాసిన అమరజీవి అడుగుజాడల్లో తెలుగువారు నడవాల్సిన అవసరం ఉందన్నారు. అనంతరం 20 మందికి అమరజీవి స్మారక పురస్కారాలను దేవేంద్రరావు ప్రదానం చేశారు. కార్యక్రమంలో ఎంపీటీసీ యతీష్, కె.ఆనందనాయుడు, డి.రోహిత్ కుమార్, కె.ప్రకాష్, జి.భూపతి, ఎస్.షణ్ముగం, మంజులాదేవి, విద్యార్థినీ విద్యార్థులు ఎస్.భావన, ఎస్. లిఖిత, టి.ఎన్.ప్రవల్లిక, ఎస్.శ్రావంత్, పి.దర్శన్, వై.రెడ్డి సారిక, పి.చార్విశ్రీ. బి.యతీశ్వరి, భువన్ చంద్ తదితరులు పాల్గొన్నారు.

ప్రత్యేక కార్పొరేషన్ ఏర్పాటు చేయాలి

రొంపిచెర్ల: తొగట వీరక్షత్రియ కులానికి ప్రభుత్వం ప్రత్యేక కార్పొరేషన్ ఏర్పాటు చేయాలని రాష్ట్ర ఈ సంఘం ఉపాధ్యక్షుడు వెంకటకృష్ణుడు డిమాండ్ చేశారు. ఆదివారం కొల్లాపురమ్మ ఆలయం పక్కన తొగట వీర క్షత్రీయ సంఘం ఆత్మీయ సమావేశం జరిగింది. ఆయన మాట్లాడుతూ తొగట కులం అభివృద్ధిలో వెనుకబడి ఉన్నారని తెలిపారు. ఎన్ని ప్రభుత్వాలు మారినా తొగట కులస్తుల బతుకులు మాత్రం మారడం లేదన్నారు. చేనేత మగ్గాలకు 200 యూనిట్ల కరెంట్ ఉచితంగా ఇస్తామని ప్రభుత్వం చెపుతోందని, కానీ ఇప్పటి వరకు అమలు జరగలేదన్నారు. చేనేతలు తయారు చేసిన వస్త్రాలకు గిట్టుబాట్టు ధరలు కల్పించాలని ఆసందర్భంగా కోరారు.కార్యక్రమంలో తొగట సంఘం నేతలు మండపల్లె బాబు, జి.రెడ్డెప్ప, ఎం.జి.వెంకటరత్నం, జి.వెంకటసుబ్బయ్య, బొమ్మల వెంకటరత్నం, పురం మల్లయ్య, వెంకటనారాయణ, వెంకటరమణ, ప్రేమానందం, లక్ష్మీ నరసయ్య, నిరంజన్, చలపతి, రామూర్తి, చౌడయ్య, మదన్‌మోహన్ పాల్గొన్నారు.

'అమరజీవి'కి ఘన నివాళి



నివాళులర్పిస్తున్న వైఎస్సార్‌సీపీ, వ్యాపార సంఘాల నాయకులు

చిత్తూరు కార్పొరేషన్: అమరజీవి పొట్టి శ్రీరాములు వర్ధంతి పురస్కరించుకుని ఆయన చిత్రపటానికి ఆదివారం వైఎస్సార్‌సీపీ కార్యాలయంలో నాయకులు ఘన నివాళి అర్పించారు. నాయకులు మీడియాతో మాట్లాడారు. మహనీయుడి ఆమరణ నిరహార దీక్షతో చేసిన ప్రాణత్యాగం మూలాన ఆంధ్ర రాష్ట్రం అవతరించిందన్నారు. దేశంలో మొట్టమొదట భాషా ప్రయుక్త రాష్ట్రంగా ఆంధ్ర రాష్ట్రం అవతరించిందని, భాషా ప్రయుక్త రాష్ట్రాల ఏర్పాటుకు పొట్టి శ్రీరాములు ఆద్యులని కీర్తించారు. నమ్మిన సిద్ధాంతానికి కట్టుబడిన గొప్ప వ్యక్తి అని స్మరించారు. ఆయనను విద్యార్థులు, యువత ఆదర్శంగా తీసుకోవాలన్నారు. పార్టీ నాయకులతో పాటు వర్తక, వాణిజ్య సంఘాల నాయకులు శ్రద్ధాంజలి ఘటించారు. కార్యక్రమంలో వాసవి క్లబ్ అధ్యక్షుడు గోవర్ధన్, వాసవి క్లబ్ కోశాధికారి శ్రీధర్ పలు సంఘాల నాయకులు కుమారస్వామిరెడ్డి, జయచంద్ర గుప్తా, శరవణ, ధర్మేంద్ర, సత్య, కృష్ణమూర్తి, నాయకులు కేపీ శ్రీధర్, ప్రకాష్, మధురెడ్డి, ప్రతిమారెడ్డి, నారాయణ, నవీన్, కవిత, ముజీబ్ తదితరులు పాల్గొన్నారు.

పెరగని రిజిస్ట్రేషన్ల ఆదాయం

- కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చాక పడిపోయిన వైనం

చిత్తూరు కార్పొరేషన్: జిల్లాలో నిర్వహిస్తున్న రెవెన్యూ సదస్సులకు సబ్ రిజిస్ట్రార్ కార్యాలయ ఉద్యోగులు కూడా వెళ్లాలని ఆదేశాలుండడంతో మధ్యాహ్నం వరకు ఆ కార్యక్రమానికి హాజరై ఆ తర్వాత కార్యాలయానికి విధుల నిమిత్తం వస్తున్నారు. అయితే ఆశించి స్థాయిలో లావాదేవీలు జరగకపోగా వినియోగదారులు కార్యాలయాల్లో పడిగాపులు కాస్తున్నారు. చిత్తూరు జిల్లాలో చిత్తూరు అర్బన్, రూరల్, బంగారుపాళ్యం, పలమనేరు, పుంగనూరు, కుప్పం, కార్వేటి నగరం, నగరితో కలిపి మొత్తం 8 సబ్‌రిజిస్ట్రార్ కార్యాలయాలున్నాయి. 2024-25 ఆర్థిక సంవత్సరంలో మొత్తం రూ.221.88 కోట్లు ఆదాయం సమకూర్చుకోవాలని లక్ష్యం నిర్దేశించుకున్నారు. అలాగే ఏప్రిల్ 1 నుంచి డిసెంబర్ 31 వరకు రూ.135.36 కోట్ల నిర్దేశిత లక్ష్యంలో డిసెంబర్ 13 వరకు రూ.101.98 కోట్లు ఆదాయం మాత్రమే వచ్చింది.

పెరగని రిజిస్ట్రేషన్లు

ప్రధానంగా కూటమి ప్రభుత్వం అసైన్‌మెంట్ ఫ్రీహోల్డ్ భూములను రిజిస్ట్రేషన్ చేయకుండా నిలుపుదల చేసింది. ఈ భూముల రిజిస్ట్రేషన్ ఆగిపోవడంతో ఒక్కసారిగా రిజిస్ట్రేషన్ శాఖ ఆదాయం పడిపోయింది. మొదట్లో ఫ్రీహోల్డ్ భూముల రిజిస్ట్రేషన్ నెల పాటు ఆపి, గత ప్రభుత్వ హయాంలో జరిగిన వాటిపై విచారణ చేయాలని నిర్ణయించారు. అయితే, విచారణ ఇంతవరకు పూర్తి కాలేదు. ఇదే సమయంలో రియల్ ఎస్టేట్ వ్యాపారం సైతం కుప్పకూలింది. జిల్లాలో చిత్తూరు అర్బన్, పలమనేరు, పుంగనూరు, కుప్పం సబ్‌రిజిస్ట్రార్ కార్యాలయాల నుంచి ఎక్కువ ఆదాయం వస్తుంది. దీనికి

తమ ప్రభుత్వం అధికారంలో వస్తే భూముల ధరలు, భవన నిర్మాణాలు పెరుగుతాయని ఎన్నికల ముందు కూటమి నాయకులు ప్రకటించిన మాటలు నీటిమూటలయ్యాయి. ప్రభుత్వం కొలువుదీరి ఆరునెలలు అయినా రియల్‌ఎస్టేట్ వ్యాపారం ఆశించిన స్థాయిలో జరగడం లేదని వ్యాపారులు వాపోతున్నారు. దీనికి తోడు నెలలో భూ ధరలు రాష్ట్ర ప్రభుత్వం పెంచనుండటం మూలిగే నక్క మీద తాటికాయ పడినట్లు ఉంటోంది ప్రస్తుత పరిస్థితి. ఈ ఆర్థిక సంవత్సరం జిల్లా రిజిస్ట్రేషన్ శాఖకు రూ.221.88 కోట్లు ఆదాయం లక్ష్యంగా నిర్దేశించారు. నవంబర్ వరకు 45,122 డ్యాకుమెంటేషన్లు చేసి రూ.101.98 కోట్లు మాత్రమే వచ్చింది.

సబ్‌రిజిస్ట్రార్ కార్యాలయాల వారీగా వచ్చిన ఆదాయం వివరాలు

సబ్‌రిజిస్ట్రార్ కార్యాలయం	ఆదాయ లక్ష్యం (రూ.కోట్లలో)	ఇప్పటివరకు వసూలు (రూ.కోట్లలో)
బంగారుపాళ్యం	11.73	7.55
కుప్పం	25.69	13.43
పుంగనూరు	33.78	17.72
చిత్తూరు అర్బన్	75.77	34.58
కార్వేటినగరం	9.70	7.20
నగరి	16.33	10.30
చిత్తూరు రూరల్	16.08	11.20
మొత్తం	రూ.221.88	రూ.101.98

తోడు జాతీయ రహదారుల నిర్మాణ పనులు జరుగుతున్నాయి. దీంతో హైవే పక్కల భూముల ధరలు పెరుగుతాయి. వీటితో పాటు తమిళనాడు, కర్ణాటక రాష్ట్రాలకు రవాణా సౌకర్యం పెరగడంతో వెంచర్లు పెరగనున్నాయి. రిజిస్ట్రేషన్ల కోసం వాడుతున్న కార్డు 2.0 ఆన్‌లైన్ వెర్షన్‌లో సాంకేతిక సమస్యలు తలెత్తడం ఇలా పలు కారణాలు క్రయవిక్రయాలపై తీవ్ర ప్రభావం చూపాయి. ఈ సమస్యలను పరిష్కరించాల్సిన ప్రభుత్వం ఇప్పటి వరకు ఆ దిశగా ఎలాంటి చర్యలు తీసుకోలేదు. గత ప్రభుత్వ హయాంలో ప్రజల ఆర్థిక స్థితి గతి బాగుండేది. సంక్షేమ పథకాల అమలుతో ఆర్థిక ఇబ్బందులు ఉండేవి కాదు. ఆర్థిక స్థితిగతులు మెరుగు పడ్డాయి. వివిధ పథకాల పరంగా ఒక్కో కుటుంబానికి ఏటా కనీసమంటే రూ.లక్ష నుంచి రెండు లక్షల వరకు ఆదాయం సమకూరేది. అయితే కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చాక ప్రజల ఆదాయం పడిపోయింది. ఇప్పటి వరకు ఒక్క రూపాయి కూడా ప్రభుత్వం నుంచి ప్రజల ఖాతాల్లో జమ కాలేదు.



జిల్లా రిజిస్ట్రార్ కార్యాలయం

మరోవైపు రానున్న మాసాల్లో రిజిస్ట్రేషన్లు మరింత తగ్గనున్నాయి. ఎన్నికలకు ముందు వరకు రోజుకు జిల్లాలో 300కు పైగా వివిధ ఆస్తుల రిజిస్ట్రేషన్లు జరిగేవి. ఇప్పుడు ఈ సంఖ్య 200కు మించడం లేదు. పరిస్థితి ఇలా ఉంటే డిసెంబర్, జనవరి నుంచి రిజిస్ట్రేషన్ చార్జీలు పెంచాలని ప్రభుత్వం ఆదేశాలు జారీ చేసింది. దీంతో అధికారులు ఎంత శాతం రిజిస్ట్రేషన్ చార్జీలు పెంచాలనే దానిపై కసరత్తు చేస్తున్నారు. కొత్త రిజిస్ట్రేషన్ చార్జీలు అమల్లోకి వస్తే రిజిస్ట్రేషన్ల సంఖ్య మరింత తగ్గే అవకాశం ఉంటుందని నిపుణులు భావిస్తున్నారు.



పాతపాళ్యం వద్ద సాగు చేసిన చామంతి పూల తోట

ఐరాల: లక్ష రూపాయలు పెట్టుబడి పెట్టి నష్టాలు చవిచూసే కన్నా బోరుబావుల కింద సాగు చేసిన చామంతిపూల తోటలు లాభాలు కురిపిస్తున్నాయని రైతన్నలు సంబరపడుతున్నారు. మండలంలోని పాతపాళ్యంలో చామంతి పూలతోటల సాగుతో రైతులు ఆదాయం కళ్లజూస్తున్నారు. పంట కోత ప్రారంభంలో మార్కెట్‌లో కిలో రూ.70 నుంచి రూ.90 వరకు ధర పలుకుతుండడంతో పాటు, పండుగల సమయంలో రూ.100 నుంచి రూ.130 వరకు విక్రయిస్తున్నారు. ఇక్కడ దాదాపు నాలుగు ఎకరాల్లో బంతి, చామంతి, గులాబి మేలైన రకాల మొక్కలను రాజమండ్రి నుంచి తీసుకొచ్చి సాగు చేస్తున్నారు. నాటిన రెండు నెలల్లోనే పూలు కోతకు వస్తాయి. ఎకరాకు నేల స్వభావం బట్టి 2 నుంచి 4 టన్నుల దిగుబడి వస్తుందని రైతులు తెలిపారు. పంట సాగు కోసం ఎకరాకు రూ.40 వేల నుంచి రూ.50 వేల వరకు ఖర్చు అవుతుందని, ఇతర పంట కంటే చామంతి పూల సాగే లాభదాయకంగా ఉందని రైతులు చెప్పారు.

ఏం పన్లేదా? నా బస్సే ఎక్కుతావా..!

- పాకాలలో మహిళా కండక్టర్ ఓవరాక్షన్
- పుంగనూరు డీఎంకు ఫిర్యాదు

పుంగనూరు: 'ప్రయాణికులతో మర్యాదగా నడుచుకోండి..మన్ననలు పొందండి.. సంస్థకు ఆదాయం పెంచండి' ఇది ఎన్నో ఏళ్ల నుంచి ఆర్టీసీ అధికారులు సిబ్బందికి తరచూ చేసే హితబోధ. అయితే కొంతమంది సిబ్బంది తీరు ఇప్పటికీ మారడం లేదు. ప్రయాణికులతో అమర్యాదగా, దురుసుగా ప్రవర్తిస్తున్నట్టు ఆదివారం పుంగ నూరు డిపోకు చెందిన ఆర్టీసీ బస్సులో చోటుచేసుకున్న సంఘటనతో మరోసారి తేటతెల్లమైంది. వివరాలు..పాకాల మండల కేంద్రం నుంచి ఓ పాత్రికేయుడు మధ్యాహ్నం 1.30 గంటలకు బస్టాండ్‌లో పుంగనూరు-తిరుపతి ఆర్టీసీ సర్వీసు (పల్లెవెలుగు) ఎక్కారు. కొంతసేపటికి కండక్టర్ టికెట్ అడగడంతో జర్నలిస్ట్ ఆర్టీసీ పాస్ ఆమెకు చూపించారు. దీంతో ఆమె కార్డును తీసుకుని పలు పర్యాయాలు చూసి, ఆతర్వాత 'ఏం పన్లేదా..నా బస్సే ఎక్కుతుంటావా?' అని ఒకింత చులకనగా అనడంతో జర్నలిస్ట్ షాక్‌కు గురయ్యారు. ప్రయాణికుల ముందు ఆమె అలా తూలనాడడంతో జర్నలిస్ట్ తనకెదురైన చేదు అనుభవాన్ని పుంగనూరు డిపో డీఎం దృష్టికి తీసుకెళ్లారు. దీనిపై ఆయన స్పందించారు. ఆ కండక్టర్‌పై చర్యలు తీసుకుంటామని, ఇలాంటి ఘటనలు పునరావృతం కాకుండా చూస్తామని డీఎం హామీ ఇచ్చారు.